

ప్రజానేతకు శుభాకాంక్షలు
శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు
ముఖ్యమంత్రివర్యులు, ఆంధ్రప్రదేశ్
స్వర్ణాంధ్ర రూపకర్త, ముఖ్యమంత్రి
శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు,
శ్రీ నారా లోకేష్‌బాబు గారి
ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి
నిరంతరం శ్రమిస్తూ... అభివృద్ధే అభిమతంగా
ప్రజానేతగా, ప్రజలమనిషిగా రాణిస్తూ...
విద్యుత్‌శాఖమంత్రిగా ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ
ఉత్తమ మంత్రిగా గుర్తింపు పొందిన
మా శ్రేయోభిలాషి
శ్రీ గొట్టిపాటి
రవికుమార్ గారు
పదవీ బాధ్యతలు చేపట్టి
ఏడాది పూర్తి చేసుకున్న
సందర్భంగా శుభాకాంక్షలు
తెలియజేస్తూ...
మీ...
కామేపల్లి లక్ష్మీప్రసాద్
కామేపల్లి ఎక్స్‌ఫోర్ట్సు అండ్ గ్రానైట్స్
జొన్నతాళి, మార్టూరు మండలం
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారు
రాష్ట్ర విద్యుత్‌శాఖామాత్యులు





ఉష్ణోగ్రత (అంచనా)

12-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	34	26
తెనాలి	35	26
నరసరావుపేట	32	25
బాపట్ల	35	27
రెంటచింతల	31	26
చీరాల	35	27



గణ.. గణ..

- నేటి నుంచి బడులు పునః ప్రారంభం
- విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీకి కార్యాచరణ
- సన్న బియ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం
- కొలిక్కివస్తోన్న బదిలీలు.. తీరనున్న ఉపాధ్యాయుల కొరత
- 20న పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం



గుంటూరు(విద్య), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగిశాయి.. వాతావరణం చల్లబడింది.. గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఆట పాటల్లో ఇంతకాలం సందడి చేసిన విద్యార్థులు బడికి బయల్దేరేందుకు సిద్ధమవుతున్నారు. దాదాపు 45 రోజుల తర్వాత పాఠశాలలు గురువారం తెరుచుకోనున్నాయి. ఇందుకు అను గుణం గా పాఠశాలల్ని ఉపాధ్యాయులు సిద్ధం చేశారు. పునః ప్రారంభం తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే ఉపాధ్యాయులకు అవగాహన తరగతులను విద్యాశాఖ నిర్వహించింది. ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్దేలా నూతన ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా అనేక నూతన సంస్కరణలు ఈ ఏడాది నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్ యాజమాన్యాల్లోని పాఠశాలల విద్యార్థులకు విద్యాకిట్లు పంపిణీకి సన్నాహాలు చేస్తున్నారు. పాఠ్య, నోట్ బుక్స్, యూనిఫాం, బూట్లు, టై, బ్యాగుతో కూడిన కిట్లు పాఠశాలలకు చేరుకున్నాయి. వాటిని గురువారం నుంచి విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ఉపాధ్యాయులు సర్వం సిద్ధం చేశారు. పాఠశాలల్లో కొరత లేకుండా ఉపాధ్యాయులు ఉండేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. బదిలీల ప్రక్రియ తుది దశకు రావడంతో మరో వారంలో పూర్తిస్థాయిలో పాఠశాలలకు ఉపాధ్యాయులు రానున్నారు. ఈ విద్యా సంవత్సరంలో చేయాల్సిన అభివృద్ధి పనుల గురించి చర్చించేందుకు ఈ నెల 20న పాఠశాలల్లో మెగా పేటీఎం(పేరెంట్స్ టీచర్స్ మీట్) నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో మార్పులు రానున్నాయి. ఇందులో భాగంగా విద్యార్థులకు సన్న బియ్యంతోనే భోజనం అందించేలా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పాఠశాలలకు సన్న బియ్యం తరలించినట్లు పౌరసరఫరాలశాఖ అధికారులు చెప్పారు. కూరలతో పాటు మెనూలో మార్పులు రానున్నాయి. తల్లికి వందనం కార్యక్రమాన్ని కూడా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తుంది.



అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాలు



రుణ లక్ష్యాలు.. ఖరారు

- రంగాల వారీగా సిద్ధం చేసిన లీడ్‌బ్యాంక్
- ఎంఎస్ఎంఈ లక్ష్యం రూ.18,043.49 కోట్లు
- విద్యకు రూ.342.98 కోట్లు..
- గృహ రుణాలు రూ.1,217.78 కోట్లు

రూ. 19,604.25 కోట్లతో ప్రణాళిక



క్యాటగిరీలు.. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల వారీగా రుణ లక్ష్యాలు ఖరారయ్యాయి. 2025- 26కు సంబంధించి లక్ష్యాలను లీడ్‌బ్యాంక్ నిర్దేశించింది. బ్యాంకుల వారీగా రుణాలకు సంబంధించి టార్గెట్లను ఇచ్చింది. మూడు జిల్లాల పరిధిలో ఆయా రంగాలలో రూ.19,604.25 కోట్ల రుణాలను పంపిణీ చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించి జిల్లాల వారీగా లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించ నున్నారు. విద్య, గృహ రుణాలకు పెద్ద పీట వేయనున్నారు. విద్యకు సంబం ధించి 20,036 మంది విద్యార్థులకు రుణాలు మంజూరు చేయాలని బ్యాంకులకు లక్ష్యాలు ఇచ్చారు. లక్ష్యాల మేర రుణాల పంపిణీ చేస్తే ఆయా వర్గాలు ఆర్థికంగా అభివృద్ధి సాధించే అవకాశాలు ఉన్నాయి. వివిధ రంగాలకు సంబంధించి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు(ఎంఎస్ఎంఈ)లకు భారీగా రుణాలు పంపిణీ చేయనున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు సంబంధించి రూ.19,604.25 కోట్లతో వార్షిక రుణ ప్రణాళికను లీడ్ బ్యాంక్ సిద్ధం చేసింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలతో పాటు విద్య, గృహ రుణాలకు లక్ష్యాలు నిర్దేశించింది. ఆయా రంగాలకు సంబంధించి ఆర్థిక సహాయం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయి. రాయితీ రుణాలు కూడా అందజేస్తున్నాయి. సదరు సంస్థలకు అందజేసే రుణాల ద్వారా కార్యకలాపాలను విస్తరించడానికి, కొత్త ఆవిష్కరణలకు రుణాలు దోహదపడతాయి. సకాలంలో రుణాలు అందక సదరు సంస్థల నిర్వాహకులు ఆర్థికంగా ఇక్కట్లు పడుతు న్నారు. ఈ పరిస్థితుల్లో ఎం ఎస్ఎంఈలను గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో స్థాపించడానికి, ప్రోత్సహించేందుకు రాయితీ రుణాలను ప్రభుత్వం ప్రకటించింది. విద్యార్థులకు ఎటువంటి ష్యూరిటీ లేకుండా విద్యా రుణాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం సూచించింది. విద్యా రుణాలు పల్నాడు జిల్లాలో 3777, గుంటూరు జిల్లాలో 11,288, బాపట్ల జిల్లాలో 4,971 విద్యార్థులకు రుణాలు ఇచ్చేందుకు లీడ్‌బ్యాంకు లక్ష్యాలు నిర్దేశించింది.

జిల్లాల వారీగా రుణ ప్రణాళిక ఇలా ఉంది

జిల్లా	ఎంఎస్ఎంఈ రుణాలు (కోట్లలో..)	విద్య రుణాలు (కోట్లలో..)	గృహ రుణాలు (కోట్లలో..)
పల్నాడు	2,604.99	74	293.34
బాపట్ల	1,291.50	70.29	184.50
గుంటూరు	14,147	198.69	739.94

ఆచరణ శూన్యం

ఏటా రుణ ప్రణాళిక ఘనంగా ఉన్నా ఆచరణ శూన్యంగా ఉంటుందన్న విమర్శలున్నాయి. బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు దరఖాస్తుదారులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ఎటువంటి హామీ లేకుండా కొన్ని రకాల రుణాలను మంజూరు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేసినా వాటిని బ్యాంకులు పట్టించుకోవడంలేదు. తీసుకున్న రుణానికి తగిన విధంగా ష్యూరిటీ ఇస్తేనే రుణం మంజూరు చేసే పరిస్థితి నెలకొంది. విద్యా రుణాలకు కూడా బ్యాంకులు ఆస్తులను హామీగా తనఖా పెట్టించుకుంటున్నాయి. బ్యాంకర్ల తీరుపై బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకుంటున్న పరిస్థితి లేదు. దీంతో బ్యాంకులు రుణాలు మంజూరు చేసేందుకు అనేక ఆంక్షలు విధిస్తున్నాయి. గత ఏడాది ప్రకటించిన ప్రణాళికలో నామమాత్రంగా కూడా రుణాలను బ్యాంకులు మంజూరు చేయలేదని లెక్కలు తెలియజేస్తున్నాయి. రుణ ప్రణాళిక ప్రకటించడం.. బ్యాంకులకు లక్ష్యాలు ఇవ్వడంతో తమ పని అయిపోయిందని లీడ్ బ్యాంకులు భావిస్తున్నాయి. ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయా లేదా అన్న అంశంపై పూర్తిస్థాయి పర్యవేక్షణ లేకుండా పోయింది.



నేడు.. ఏడాది విజయోత్సవాలు

- వేడుకలకు కూటమి శ్రేణులు సిద్ధం
- బైక్‌ర్యాలీలు.. కేక్ కటింగ్‌లకు ఏర్పాట్లు
- అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల అరాచకం.. అకృత్యాలతో.. అల్లాడిన ఓటర్లు పోటెత్తడంతో వైసీపీ పాలన అంతమై కూటమి అధికారం చేపట్టి గురువారంతో ఏడాది అవుతుంది. గత ఏడాది జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగ్గా.. అదే నెల 12న ముఖ్య మంత్రిగా చంద్రబాబు నేతృత్వంలో కూటమి పాలనా పగ్గాలు చేపట్టింది. నాడు పండుగ వాతావరణంలో ప్రమాణ స్వీకార మహోత్సవం జరగ్గా.. అది గురువారానికి ఏడాది అవుతుంది. ఏడాది పాలన పూర్తయిన సందర్భాన్ని వేడుకగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సుపరిపాలన.. స్వర్ణాం ధ్రప్రదేశ్ పేరుతో నిర్వహించే వేడుకల్లో ఎమ్మెల్యేలు పాల్గొనున్నారు. ఈ క్రమంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో విజయోత్సవాలకు కూటమి శ్రేణులు సిద్ధమయ్యారు. గురువారం అన్ని నియోజకవర్గాల్లో ఏడాది పాలనా ఉత్సవాలను ఘనంగా కూటమి శ్రేణులు జరుపుకోనున్నాయి. ఇందుకోసం అన్ని ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నాయకులు, కార్యకర్తలు భారీగా ఏర్పాట్లు చేశారు. యువత ఆధ్వర్యంలో పట్టణాల్లో బైక్‌ర్యాలీలు నిర్వహించనున్నారు. కేక్ కటింగ్‌లతో పాటు బాణసంచా పెద్దఎత్తున కాల్చేందుకు శ్రేణులు సిద్ధమ య్యాయి. ప్రదర్శనలతో పాటు సంబరాలను జయప్రదం చేయాలని కూటమి నేతలు, కార్యకర్తలకు ఎమ్మెల్యేలు పిలుపు నిచ్చారు. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబం ధించి ఏడాది విజయోత్సవ సంబరాల ద్వారా ప్రజలకు నేతలు వివరించను న్నారు. నియోజకవర్గాల్లో ఈ ఏడాదిలో నియోజకవర్గాల్లో కూటమి నేతృ త్వంలో జరిగిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేయనున్నారు.

వేడుకగా ఏరువాక

- పల్లెల్లో రైతుల సంబరాలు
- దుక్కిదున్ని సాగు పనుల ప్రారంభం
- మంతెనవారిపాలెం ఏరువాకలో ఎమ్మెల్యే వేగేశన



పొలంలో హలం దున్నుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, రైతులు, కూటమిశ్రేణులు

పిట్టలవానిపాలెం, వేమూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఏరువాక సాగారోరన్న అంటూ.. పల్లె కదిలింది. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా కుల, మతాలకు అతీతంగా ఏరువాక ఉత్సవంలో పల్లెల్లో సందడి నెలకొంది. బుధవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పండుగ వాతావరణంలో ఏరువాక ఉత్స వాలు జరిగాయి. జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పిట్టలవానిపాలెం మండలం మంతెనవారిపాలెంలో జరిగిన ఏరువాక పౌర్ణమిలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొన్నారు. ఎద్దులను, అరకలను ప్రత్యేకంగా అలంకరించి సంప్రదాయ దుస్తులతో రైతులు కుటుంబాలతో ఊరేగింపుగా ఆలయాలకు తరలివచ్చి పూజలు చేశారు. వేమూరులోని గణపతి ఆలయంలో ఏరువాక పూర్ణిమ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంపనిలోని సిద్ధి గణపతి, రత్నగర్భ గణపతి, వేమూరులోని లక్ష్మీగణపతి, చావలి, పెరవలి, చదలవాడ, అబ్బనగూడవల్లి గ్రామాల్లోని శివాలయాల్లో పంచామృతాభిషేకాలు జరిపారు. రైతుల గోత్రనామాలతో పూజలు జరిపించు కుని ఎడ్లతో కూడిన నాగళ్లతో ఆలయాల్లో ప్రదక్షిణలు చేశారు. తలపాగ చుట్టి, చంద్రకోలు చేతబట్టి అరకలతో పొలాల కు రైతన్నలు తరలివెళ్లారు. కోటి ఆశలతో భూ మాతకు నమస్కరించి సాగును ప్రారంభించారు.



ఖాజీపాలెం నుంచి మంతెన వారిపాలెం వరకు ట్రాక్టర్లతో ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

ట్రాక్టర్లతో రైతుల ర్యాలీ

ఖాజీపాలెం నుంచి జీఎస్‌పాలెం, పిట్టలవానిపాలెం గ్రామాల మీదగా ఎమ్మెల్యే వేగేశనతో కలిసి ట్రాక్టర్లతో భారీ ర్యాలీగా మంతెనవారిపాలెం గ్రామానికి రైతులు చేరుకున్నారు. మంతెనవారిపాలెంలో వేగేశన సత్యంరాజు పొలం దున్నిన ఎమ్మెల్యే ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకముందు రైతులు, కూటమిశ్రేణులతో కలిసి ఎమ్మెల్యే భూమాతకు పూజలు చేశారు. అనంతరం జిల్లా వ్యవసాయశాఖాధికారి వై.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు లేకపోతే ఆహారోత్పత్తులు అందుబాటులో ఉండావన్నారు. వ్యవసాయశాఖాధికారుల సహకారంతో రైతులు మంచి ఫలితాలను సాధించాలన్నారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, జిల్లా ఉద్యాన వన శాఖాధికారిణి జెన్నెమ్మ, శాస్త్రవేత్తలు డి.కృష్ణవేణి, ఎం.ఉష, డీపీఏమ్ వి.వాణిశ్రీ, డీఏహెచ్‌వో డి.వేణుగోపాల్, డీఆర్సీ టి.రత్నకుమారి, ఏడీఏ ఎస్‌కె.అక్తార్ హుస్సేన్, తహసీల్దారు డి.వెంకటేశ్వరరావు, ఏడీఏ ఎ.లక్ష్మి, ఎంఈవో సి.హెచ్.సత్యానంద్, ఏవో తిరుమలరావు, చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు అఫ్జల్, సర్పంచ్ లక్కంరాజు ఆదిలక్ష్మీ వెంకటపతిరాజు, నాయకులు కనుమూరి సాంబమూర్తిరాజు, పిట్టు సాయిబాబారెడ్డి, మురళీరాజు, బొలగాని వెంకటసులోచన నారాయణ,కలకోట చక్రధర్‌రెడ్డి, కలకోట కిశోర్‌రెడ్డి, సయ్యద్ నిజాం, మంతెన గంగరాజు, మంతెన కృష్ణమూర్తిరాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రజలకు చేరువ కావాలి

- నెల్లూరు జోన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి
- బాపట్ల డిపో, గ్యారేజీలో ఆకస్మికంగా తనిఖీలు



ఆర్టీసీ అధికారులకు సూచనలు ఇస్తున్న సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

బాపట్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మరింతగా సేవలను ప్రజలకు చేరువ చేయాలని, సర్వీస్‌లు పెంచాలని ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బాపట్ల పర్యటనలో భాగంగా బుధవారం ఆయన స్థానిక డిపో, గ్యారేజీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిపో ఆవరణలో రోడ్డు ధ్వంసమై గుంతల్లో నిలిచిన నీటిని పరిశీలించి తక్షణం మరమ్మతులు చేపట్టాలని అధికారులకు తెలిపారు. ప్రాంగణంలో కళావిహీనంగా ఉన్న దీన్ దయాళ్ ఉద్యానవనానికి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. ఆర్ఎం ఎం.రవికాంత్, డీఎం బి.శ్రీమన్నారాయణలకు పలు సూచనలు చేశారు. డిపోలో పోస్టుల భర్తీ, జిల్లాలోని అన్ని ప్రాంతాలకు కొత్తగా సర్వీస్‌లను ఏర్పాటు చేయాలని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు బి.తిరుమలరెడ్డి, మున్నంగి కుమార్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. గ్యారేజి, డిపోలో గుంతల రోడ్లలో బస్సులను నడపడం కష్టంగా ఉందని వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండమూరి బంగారు బాబు, మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు బ్రహ్మాండం బాలనారాయణ, నాయకులు బి.బాబునాగేంద్ర, వెంకట్రావు, కొండారెడ్డి అనీల్‌కుమార్, రాంపల్లిజగన్నాథశాస్త్రి, మామిడి రమేష్‌కుమార్, జీవీఎల్ మోహన్‌గౌడ్, జిట్టా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారాను పూర్తిగా నిర్మూలించాలి

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ

బాపట్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాటుసారాను పూర్తిగా నిర్మూలించాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ ఆదేశించారు. నవోదయం 2.0పై జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం ఎస్‌హెచ్‌వోలతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా రాహుల్‌దేవ్‌శర్మ మాట్లాడుతూ జిల్లాలో నాటు సారా ప్రభావిత గ్రామాలు ఉండకూడదన్నారు. సారా నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలపై సూచనలు, సలహాలు తెలియపర్చారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కె.హేమంత నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ ఎం.సుధాకర్‌రెడ్డి, ఏ.దయాసాగర్, జిల్లాఅధికారి బి.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎ.జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ

ఎట్టకేలకు ఎస్జీటీలకు కౌన్సెలింగ్

- తొలిరోజు 350 మందికి బదిలీలు పూర్తి
- జడ్పీలో అర్ధరాత్రి వరకు సాగిన ప్రక్రియ



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా


గుంటూరు(విద్య), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక సమస్యలతో మంగళవారం నిలిచిపోయిన ఎస్జీటీల కౌన్సెలింగ్ బుధవారం ఎట్టకేలకు జరిగింది. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో తొలిరోజు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధి లోని ఎస్జీటీలకు కౌన్సెలింగ్ చేపట్టారు. ఒకటో నంబరు నుంచి 750 నెంబరు వరకు కౌన్సెలింగ్ చేపట్టారు. రాత్రి పొద్దుపోయే వరకు బదిలీల ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. రాత్రి 9 గంటల వరకు 350 మందికిపైగా కౌన్సెలింగ్ నిర్వహించారు. అంతకముందు జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు, పల్నాడు డీఈవోలు రేణుక, చంద్రకళ, జేడీ శైలజ, పరిశీలకులు లక్ష్మీకుమారి, సహాయ సంచాలకులు శైలజబాయి, ఆర్.రమణ పాల్గొన్నారు

స్పౌజ్ పింఛన్ల పంపిణీ వాయిదా

- మూడు జిల్లాల్లో 8,374 మందికి మంజూరు
- ఏడాది విజయోత్సవాలతో పింఛన్లకు అవాంతరం?

గుంటూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్పౌజ్ కోటాలో నూతనంగా ఎంపికైన వారికి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ వాయిదా పడింది. కూటమి కొలువు తీరిన జూన్ 12న అంటే గురువారం పింఛన్లు పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా విజయోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించిది. ఈ కార్యక్రమాల్లో ఎక్కడికక్కడ స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో పింఛన్ల పంపిణీ కార్య క్రమాలకు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు అందుబాటులో ఉండే అవకాశం లేదు. దీంతో పింఛన్ల పంపిణీ కార్యక్రమం వాయిదా వేసి నట్లు సమాచారం. 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్య కాలంలో మృతి చెందినవారి జీవిత భాగస్వాములకు పింఛను పొందే అవకాశం ప్రభుత్వం కల్పించింది. దీంతో ఈ కోటాలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు సం బంధించి 8,374 మంది అర్హత సాధించారు. గుంటూరు జిల్లా నుంచి 2,565 మంది, బాపట్ల జిల్లా నుంచి 2,715 మంది, పల్నాడు జిల్లా నుంచి అత్యధికంగా 3,094 మంది స్పౌజ్ కోటాలో కొత్తగా పింఛను పొందారు. వీరందరికీ త్వరలోనే పింఛన్లు అం దజేస్తామని అధికారులు చెబుతున్నారు.

డీజీపీని కలిసిన ఎమ్మెల్యే యరపతినేని



డీజీపీకి తిరుపతి ప్రసాదం అందజేస్తున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు బుధవారం రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పల్నాడులో శాంతి భద్రతలు బాగుండటంతో పాటు గతంలో వున్న ఫ్యాక్షన్ పూర్తిగా తగ్గిపోవడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు యరపతినేని హరీష్‌కుమార్ గుప్తాకు వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు తిరుపతి ప్రసాదాన్ని ఎమ్మెల్యే యరపతినేని అందజేశారు.

ఏఎన్‌యూ అభివృద్ధికి సచ్చిదానందమూర్తి కృషి

ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించిన ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తి

పెదకాకాని, జూన్ 11(ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాలు సామాజిక విలువలను పెంపొందించే తత్వ కేంద్రాలుగా విలసిల్లాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కొత్త మధుమూర్తి అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని బుద్దిస్ట్ స్టడీస్ విభాగం వద్ద ఏర్పాటుచేసిన తత్వవేత్త, యూజీసీ మాజీ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి కాంస్య విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య మధుమూర్తి మాట్లాడుతూ కొత్త సచ్చిదానందమూర్తి తత్వశాస్త్రంలో చేసిన కృషి, ప్రపంచ దేశంలోని పరిశోధకులను కూడా ఆకర్షించిందని తెలిపారు. ఆయన విద్యారంగంలో విలువలను అభివృద్ధి చేయడానికి కృషి చేశారని, ఏఎన్‌యూ సర్వతోముఖాభివృద్ధికి సచ్చిదానందమూర్తి ఎనలేని సేవలందించారని, ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. ఏఎన్‌యూ ఉపకులపతి ఆచార్య కే గంగాధర్‌రావు మాట్లాడుతూ సచ్చిదానందమూర్తి కృషివలన ఏఎన్‌యూలో మహాయన బౌద్ధ అధ్యయన కేంద్రం, శాస్త్రీయ సామ్యవాద కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఆచార్య సురేష్‌కుమార్, ఆచార్య వీరయ్య, ఆచార్య పాల్ కుమార్, ఆచార్య సిద్దయ్య, డాక్టర్ డీ రవిశంకర్ రెడ్డి, ఆచార్య దివ్యతేజమూర్తి, ఆచార్య వీ వెంకటేశ్వర్లు, ఆచార్య రామచంద్రన్, ఆచార్య రవికుమార్, ఆచార్య ఆర్ శివరాం ప్రసా ద్, ఆచార్య పీ సుధాకర్, ఆచార్య వై అశోక్‌కుమార్, ఆచార్య సుబ్బారావు, ఆచార్య కే వెంకట్రావు, ఆచార్య తులసీదాస్ విద్యార్థులు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణ చేస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ కొత్త మధుమూర్తి

నేడు మంత్రి అచ్చెన్నాయుడు రాక

● దుగ్గిరాల రైతులకు జరిగిన నష్టంపై అధికారులతో సమీక్ష

గుంటూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కే అచ్చెన్నాయుడు గురువారం గుంటూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన లాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం గుంటూరు నగరం చుట్టుగుంట సెంటర్‌లోని మార్కెటింగ్ కమిషనరేట్‌కు చేరుకొని దుగ్గిరాల ఏఎంసీ పరిధిలో గత ఏడాది కోల్డ్‌స్టోరేజ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో రైతులు నిల్వ చేసుకున్న పంట ఉత్పత్తులకు నష్టం జరిగింది. అయితే దీనికి సంబంధించి ఇప్పటివరకు రైతులకు నష్టపరిహారం బీమా కంపెనీల నుంచి విడుదల కాలేదు. ఈ అంశంపై ఆయన మార్కెటింగ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని అధికారవర్గాలు ఈ సందర్భంగా తెలిపాయి.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 21.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా మూడు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

నాటక రంగ అభివృద్ధికి సీఎం కృషి

● ఆంధ్రప్రదేశ్ నాటక కళాపరిషత్ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ



మాట్లాడుతున్న గుమ్మడి గోపాలకృష్ణ

తాడేపల్లి టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరులో బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రజానాటిక కళాపరిషత్ నూతన ఆఫీసును ఆంధ్రప్రదేశ్ నాటక కళాపరిషత్ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కళలు, కళాకారుల పట్ల ఎక్కువ మక్కువ ఉందని చెప్పారు. రెండోసారి నాటక అకాడమి చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఏపీలో నాటక వికాసానికి కళాకారులు రచయితలు, నటులు నటీమణులు, పరిషత్ నిర్వాహకులు దేవస్థాన కమిటీలు ఏపీలో నాటక పోషకులు ఎంత మంది ఉన్నారో వారందరి సహకారం చేతి కళాపోషకుల సహకారం తీసుకుని ముందుకు వెళతామన్నారు. నాటక రంగ అభివృదికి సీఎం చంద్రబాబు, మంత్రి కందుల దుర్గేష్ ఎంతో అండగా ఉన్నారన్నారు. యువగళం పాదయాత్రతో సంచలనం సృష్టించిన యువ నేత నారా లోకేశ్ తనను చంద్రబాబు నాయుడుకి పరిచయం చేశారన్నారు. ఈ ప్రాంతంలో లోకేశ్ క్రీడా ప్రాంగణం ఉందని, దీనిని కళా ప్రాంగణంగా మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు అరవపల్లి శ్రీనివాస్, కోగంటి ప్రసాద్, పీ నాగేశ్వరరావు, కే సత్యనారాయణ, వంశీ, హరిబాబు, నరసింహారావు, రంగనాయకులు, సాంబశివరావు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మిర్చి నాణ్యతని దెబ్బతీసే పురుగుమందులను నిషేధించాలి

● చిల్లీస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ నేతల విజ్ఞప్తి

గుంటూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు ఎగుమతి అయ్యే మిర్చి నాణ్యత ప్రమాణాలు ఏ విధంగా ఉండాలనే వివరాలను ఆయా దేశాల నుంచి కేంద్ర ప్రభుత్వం తెప్పించుకోవాలని చిల్లీస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ నేతలు కోరారు. అలానే పురుగు మందుల అవశేషాలు మోతాదుకు మించి ఉన్న వాటిని వివిధ దేశాలు తిరస్కరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ అవశేషాలు కలిగిన పురుగుమందులను రైతులు వినియోగించు కుండా నిషేధించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం గుంటూరు మిర్చియార్డు ఆవరణలోని చిల్లీస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్‌లో అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో చర్చించిన వివరాలను అసోసియేషన్ అధ్యక్షుడు వెలగపూడి సాంబశివరావు, జనరల్ సెక్రెటరీ తోట రామకృష్ణ మీడియాకు వివరించారు. చైనా, అమెరికా, యూరప్ ఖండం దేశాలు ఎలాంటి నాణ్యత ప్రమాణాలు కోరుకొంటున్నాయో తెలుసుకొని వాటిపై స్పైసెస్‌బోర్డు ద్వారా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. దాని వలన ఎగుమతుల తిరస్కరణలు అనేవి లేకుండా ఉంటాయని చెప్పారు. అప్పుడు రైతుకు, ట్రేడర్‌కు మేలు జరుగుతుందన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న చిల్లీస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ నేతలు

ఎగుమతులు పెరిగినా ధర ఎందుకు పెరగలేదంటే...

చైనా దేశానికి ఏటా 2 లక్షల టన్నుల మిర్చి ఎగుమతి జరుగుతుంటుందని సాంబశివరావు, రామకృష్ణ తెలిపారు. అయితే ఈ సంవత్సరం 3 లక్షల టన్నులు ఎగుమతి అయిందన్నారు. ఇందుకు కారణం చైనాలోని రెండు ప్రావిన్స్‌ల లో ప్రతికూల పరిస్థితులేనని చెప్పారు. ఒక ప్రావిన్స్ లో మిర్చి విస్తీర్ణాన్ని పూర్తిగా తగ్గించేయగా, రెండో ప్రావిన్స్‌లో ప్రకృతి విపత్తులు కారణంగా నష్టం వాటిల్లిందన్నారు. ఈ కారణంగా ఎగుమతులు పెరిగాయేత ప్పా మార్కెట్ ధర పెరగలేదన్నారు. వాస్తవానికి మిర్చి ధర ఎక్కువగా ఉంటేనే తమకు సులభంగా టర్నోవర్ పూర్తి అయి లాభాలు వస్తాయన్నారు.

వర్షాలు కురిసి.. పంటలు బాగా పండాలి

● వీసీ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మీదేవి

లాంఫాం(తాడికొండ) జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవి ద్యాలయం వీసీ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మీదేవి పేర్కొన్నారు. బుధవారం లాంఫాంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని సాంప్రదాయ బద్దంగా విత్తనాలు నాటి జరిపారు. కార్యక్రమానికి ముఖ్యఅ తిథిగా విచ్చేసిన వీసీ శారద జయలక్ష్మీదేవి మాట్లాడుతూ వర్షాలు సకాలంలో కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీవీ సత్యనారాయణ, విస్తరణ సంచాలకులు డాక్టర్ జీ శివనారాయణ, డాక్టర్ బీ శ్రీలక్ష్మీ, డాక్టర్ బీవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఏ మణి, డాక్టర్ డీ సంపత్‌కుమార్, డాక్టర్ జీ కరుణసాగర్, డాక్టర్ ఏవీ రమణ, డాక్టర్ కే రాధిక, సహపరిశోధన సంచాలకులు డాక్టర్ ఎస్‌వీవీఎస్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఏరువాక పౌర్ణమిలో పాల్గొన్న వీసీ శారద జయలక్ష్మీదేవి, అధికారులు

హత్యకేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు

బాపట్లరూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం చెరువుజమ్ములపాలెం ఎస్సీకాలనీలో భార్యపై పెట్రోల్ పోసి హత్యకు పాల్పడిన వ్యక్తిని బుధవారం బాపట్ల రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి మీడియా ముందు ప్రవేశపెట్టారు. బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు తెలిపిన వివరాలు ప్రకారం చెరువుజమ్ములపాలెం ఎస్సీ కాలనీకి చెందిన సుభాషిణి అనే మహిళను అదే గ్రామానికి చెందిన హరీష్ అనే వ్యక్తి సుమారు 12 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు తారక్, సాత్విక్‌లు ఉన్నారు. హరీష్ ఆటోడ్రైవర్‌గా, మృతురాలు సుభాషిణి కూలి పనులకు వెళుతూ జీవనం సాగించేవారు. ఇటీవల మృతురాలు సుభాషిణి పేరుమీద రేషన్ డీలర్‌షిప్ వచ్చింది. నిందితుడు హరీష్ చాలా కాలం నుంచి సుభాషిణిని మానసికంగా, శారీరకంగా హింసిస్తూ ఉండేవాడు. ఆవిషయాలను ఆమె తల్లి వైపు వారికి చెప్పకుండా భరించేది. ఇదిలా ఉండగా సుభాషిణి మీద అనుమానం పెంచుకున్న హరీష్ ఈ నెల 9వ తేదీన ఆమెతో గొడవపడి మధ్యాహ్నం 12 గంటల సమయంలో మంచం మీద పడుకొని వున్న భార్య మీద పెట్రోలు పోసి నిప్పు అంటించాడు. దాంతో సుభాషిణి కేకలు వేసుకుంటూ బయటకొచ్చి పడిపోవటంతో స్థానికులు మంటలను ఆర్పి వేశారు. హరీష్ పారిపోయాడు. అనంతరం గ్రామస్తులు అంబులెన్స్ ద్వారా గాయపడిన సుభాషిణిని తొలుత బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వవైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందినది. మృతురాలి తల్లి మేరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. బుధవారం సాయంత్రం నిందితుడిని అరెస్ట్ చేశామని డీఎస్పీ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- కలెక్టర్ జె.వెంకటమురళి
- దత్తతు తీసుకున్న విద్యార్థికి రూ.50 వేలు అందజేత

బాపట్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : అధైర్య పడొద్దు అండగా ఉంటానని కలెక్టర్ జె.వెంకటమురళి దత్తతు తీసుకున్న యువకుడికి భరోసానిచ్చారు. జిల్లాలోని చీరాల మండలం హస్తినాపురం గ్రామానికి చెందిన పముజుల వెంకటశిరీష గ్రామ సమాఖ్య సహాయకురాలుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నది. భర్త వదిలేయటంతో కుమారుడే లోకం అని భావించి అతని కోసం కొన్నేళ్ళగా ఒంటరి జీవితం కొనసాగిస్తున్నది. ఇటీవల ఆమె అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి వరకు అన్ని తానై చూసుకున్న తల్లి మృతి చెందటంతో కుమారుడి జీవితం అంధకారంగా మారింది. కుమారుడు పవన్ ఏకాకిగా మిగిలాడు. పవన్ బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఫైనలీయర్ చదువుతున్నాడు. పవన్‌కు డీఆర్‌డీఏ బాసటగా నిలిచింది. పవన్ చదువుల కోసం చేయూతనందించాలని నిర్ణయించింది. వెంటనే పి4 కింద దత్తతు తీసుకుంది. చీరాలకు చెందిన గ్రామ సమాఖ్య సభ్యులంతా కలిసి రూ.50 వేలు సమకూర్చి కలెక్టర్ జె.వెంకటమురళి చేతుల మీదగా బుధవారం అందించారు. పవన్ గురించి తెలుసుకున్న కలెక్టర్ ఎప్పుడైనా ఎటువంటి కష్టం వచ్చినా తనను కలవవచ్చునని భరోసానిచ్చారు. జిల్లాలో మొదటిసారిగా యువకుడిని డీఆర్‌డీఏ దత్తతు తీసుకోవటంపై ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావును కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.



విద్యార్థికి నగదు అందజేసి అభినందిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

శక్తివంతమైన నాయకుడు నరేంద్రమోదీ

- బీజేపీ నాయకుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

బాపట్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ దేశాలలో భారత దేశానికి విశేష ఖ్యాతిని తీసుకొచ్చిన ప్రధాని నరేంద్రమోదీ శక్తివంతమైన నాయకుడని బీజేపీ నాయకుడు, ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి స్పష్టం చేశారు. భారత ప్రధానిగా నరేంద్రమోదీ 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం పార్టీశ్రేణులతో కలిసి విలేకర్ల సమావేశంలో ఏర్పాటు చేశారు. సమావేశంలో సురేష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో కుంభకోణాలు అధికంగా జరిగేవన్నారు. అలాంటి పరిస్థితులలో మూడుసార్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా చేసిన నరేంద్రమోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి దేశంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. విదేశాల నుంచి ఆయుధాలు దిగుమతి చేసుకునే స్థాయి నుంచి నేడు ఆయుధాలు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగామన్నారు. సైనికులకు స్వేచ్ఛనిచ్చి ఉగ్రమూకను తరిమి కొట్టారన్నారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో పహల్గాం ఉగ్రమూకను అంతమొందించారన్నారు. లక్షా43వేల కోట్ల రూపాయల బడ్జెట్ రైతులకు కేటాయించటం జరిగిందన్నారు. జలజీవన్‌మిషన్ ద్వారా 15 కోట్ల మందికి కుళాయి కనెక్షన్‌లివ్వటం జరిగిందన్నారు. వ్యవసాయ యంత్ర పరికరాలు 70శాతం సబ్సిడీతో కేంద్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండమూరి బంగారుబాబు, మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీ నారాయణ, సీనియర్ నాయకులు బి.బాబునాగేంద్ర, పట్టణ పార్టీ అధ్యక్షుడు బ్రహ్మాండం బాలనారాయణ, వెంకట్రావు, కొండారెడ్డి అనీల్‌కుమార్, రాంపల్లి జగన్నాధశాస్త్రి, మామిడి రమేష్‌కుమార్, జీవీఎల్ మోహన్‌గౌడ్, జిట్టా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

ఆర్టీసీ సర్వీస్‌లు పెంచాలని వినతి

బాపట్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఆర్టీసీ డిపో పరిధిలో ఒకప్పుడు 59 సర్వీస్‌లు ఉండేవని జిల్లా అయిన తర్వాత ప్రస్తుతం 40 సర్వీస్‌లకు తగ్గిపోయాయని తెలుగుదేశం పార్టీ నాయకుడు జిట్టా శ్రీనివాసరావు బుధవారం బాపట్ల విచ్చేసిన ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి వినతిపత్రం ద్వారా వివరించారు. కాలం చెల్లిన బస్సులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దూరప్రాంత సర్వీస్‌లైన బాపట్ల-బెంగుళూరు, బాపట్ల-హైదరాబాద్, తిరుపతి-శ్రీశైలం, మంత్రాలయం, భద్రాచలం, పర్యాటక కేంద్రమైన సూర్యలంకకు సర్వీస్‌లు ఏర్పాటు చేయాలన్నారు. బాపట్ల డిపో నుంచి విజయవాడకు సర్వీస్‌లు ఏర్పాటు చేయకపోవటం వల్ల చీరాల బస్సులపై ఆధార పడాల్సి వస్తుందన్నారు. జిల్లాలోని రేపల్లె, చీరాల, అద్దంకి డిపోలకు కొత్త బస్సులు కేటాయించి జిల్లా కేంద్రమైన బాపట్లను పూర్తిగా విస్మరించారన్నారు. సర్వీస్‌లు పెంచి పెరిగిన పట్టణ జనాభా, జిల్లా కేంద్రాన్ని దృష్టిలో పెట్టుకొని దూరప్రాంతాలకు కూడా సర్వీస్‌లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

వ్యవసాయ కళాశాలలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం

బాపట్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల వ్యవసాయ కళాశాలలో బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాలలోని హెల్త్ క్లినిక్ దగ్గర రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి ప్రారంభించారు. రక్తకొరత వల్ల ఏ ఒక్క ప్రాణానికి హానీ కలగకుండా తమ వంతు కృషి చేస్తామని కళాశాల సిబ్బంది, విద్యార్థులు, వైద్యసిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కళాశాల విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.రాజేష్, డాక్టర్ ఎం.రమాదేవి, డాక్టర్ సి.సంధ్యారాణి, డాక్టర్ జి.విజయ్‌కుమార్, డాక్టర్ రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.



వ్యవసాయ కళాశాలలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

సీతారామయ్యకు ఘనంగా పుష్పయాగం



పుష్పయాగంలో శ్రీ సీతారామస్వామి

పిట్టలవానిపాలెం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం గ్రామంలోని శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానంలో బుధవారం స్వామివారికి జేష్ఠమాస పౌర్ణమి కార్యక్రమం పురస్కరించుకొని 108 కలశాలతో, వివిధ రకాల నదిజలాలతో అభిషేక కార్యక్రమాలు నిర్వహించటం జరిగిందని ఆలయ అర్చకస్వామి బృందావనం గోపిచంద్ తెలిపారు. సీతారామయ్యకు ఘనంగా పుష్పయాగ సహిత జేష్ఠాభిషేకాన్ని విశేషంగా తులసీదళ సహిత పుష్పయాగం ఘనంగా నిర్వహించటం జరిగిందని, దీనివలన దేశంలో శాంతి నెలకొని, గ్రామాలు పాడిపంటలతో సస్యశ్యామలంగా ఉంటాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక పూజలు నిర్వహించుకొని స్వామివారి మంగళశాసనాలు పొందారు.



మండూరు గ్రామంలో సీసీ రోడ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు



హనుమాన్‌నగర్‌లో సీసీరోడ్ల శిలఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

నాడు విధ్వంస పాలన.. నేడు ప్రజాహిత పాలన

- ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

వేమూరు, చుండూరు జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గడచిన ఐదు సంవత్సరాలలో జగన్ విధ్వంసం పాలన కొనసాగించినా ఈనాడు కూటమి ప్రభుత్వం ద్వారా రాష్ట్రంలో ప్రజాహిత పాలన కొనసాగుతున్నదని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. ఆయన వేమూరు మండలం పెరవలి, పెరవలిపాలెం గ్రామాలలో ఉపాధి నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను, చుండూరు మండలంలోని చినపరిమి, మండూరు గ్రామాల్లో రూ.46 లక్షల నిధులతో నిర్మించిన ఏడు సీసీ రోడ్లను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి లేకపోగా ప్రజా నయవంచన పాలనను కొనసాగించారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అభివృద్ధి, సంక్షేమాన్ని ఎంతగానో ముందుకు తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో ఉపాధి నిధుల ద్వారా 61 సీసీ రోడ్లకు రూ.10 కోట్ల 71 లక్షల నిధులను కేటాయించడం జరిగిందన్నారు. సంబంధించిన రోడ్ల పనులు చురుకుగా సాగుతున్నాయని, ఫేజ్-1లో పూర్తయిన రోడ్లను ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వేమూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, పంచాయతీరాజ్ డీఈ కృష్ణారెడ్డి, తహసీల్దార్లు నాగరాజారావు, సుశీల, ఎంపీడీవో సుదీప, పంచాయతీరాజ్ ఏఈలు మరియదాసు, బదరీ నారాయణ, పంచాయతీ కార్యదర్శులు సుజాత, ప్రభ, టీడీపీ నాయకులు శివారెడ్డి, ఎల్లారెడ్డి, జొన్నకూటి సాంబశివరావు, కేశం శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, అశోక్, ఖాసీం, వెంకటరెడ్డి, అయ్యప్పరెడ్డి, జాన్, ప్రసాదం బసవయ్య, దాది లక్ష్మణరావు, కంచి సీతారామయ్య, దాసరి చిన్న, గాజుల వెంకటసుబ్బయ్య, బండారు సూరిబాబు, వేల్పుల రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందబాబు

అమృతలూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండల పరిధిలోని కూచిపూడి, అమృతలూరు గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన ఈ రోడ్డును బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరుగుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారిగంగాధర్, క్రొత్తపల్లి రవీంద్రబాబు, శరణుగిరి, సర్పంచ్ రాము, మార్కెట్ యార్డు డైరక్టర్ మొవ్వా శ్రీనివాసరావు, శరణు నాగేశ్వరరావు, కూచిపూడిలో యలవర్తి బ్రహ్మానందం, మట్లపూడి జయపాల్, యలమంచిలి జగన్మోహనరావు, మేకా రాంబాబు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో అభివృద్ధి టీడీపీ ప్రభుత్వంలోనే సాధ్యమౌతున్నదని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. బాపట్ల మండలం ఆసోదివారిపాలెం, హనుమాన్ నగర్ గ్రామాలలో రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీరోడ్లను బుధవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక వసతులను కల్పించటంతోపాటు ప్రధానంగా కావాల్సిన రోడ్లు నిర్మించటం జరుగుతున్నదన్నారు. రాబోవు కాలంలో కూడా మిగిలి ఉన్న గ్రామాలలో సీసీ రోడ్లు వేయించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల మార్కెట్ యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, బాపట్ల తహసీల్దార్ సలీమా, ఎంపీడీవో బాబు రావు, ఈవోపీఆర్డీ డి.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఏఈ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

వంతెనకు శంకుస్థాపన

బాపట్లరూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం అడవిపల్లెపాలెం గ్రామంలో 8కోట్ల వ్యయంతో ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ డ్రెయిన్ మీద నూతనంగా నిర్మించబోయే వంతెనను బుధవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, చీరాల ఎమ్మెల్యే ఎం.మాలకొండయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల మార్కెట్ యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, బాపట్ల, తహసీల్దార్ సలీమా, ఎంపీడీవో బాబురావు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలకు ఉచిత ఇన్సూరెన్స్ ఇవ్వాలి

కర్లపాలెం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గొర్రెలు, మేకలు జీవాలన్నిటికి రాష్ట్రప్రభుత్వం ఉచిత ఇన్సూరెన్స్ ఇవ్వాలని, 50 సంవత్సరాలు నిండిన గొర్రెల కాపరులకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని, సబ్సిడీపై మందులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెల మేకల పెంపకదారుల సంఘ (జీఎంపీఎస్) బాపట్ల జిల్లా కార్యదర్శి బుర్రి ఆంజనేయులు అన్నారు. కర్లపాలెంలోని శ్రీవాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఏపి గొర్రెల మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో మహాసభ నిర్వహించగా జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి వేణుగోపాలరావు, మండల పశువైద్యాధికారి రేచల్ దివ్య పాల్గొని పలుసూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ గంగయ్య, రాష్ట్ర సంఘ కార్యదర్శి కిలారు పెద్దబ్బాయి, ఉపాధ్యక్షుడు తోట తిరుపతిరావు, నాయకులు కొండయ్య, మద్దెన శేషు, వెంకటేశ్వర్లు, రైతులు గొర్ల వెంకట్రావు, నాగరాజు, ప్రసాద్, సుబ్బారావు, అక్కల శ్రీనివాసరెడ్డి, గవిని సురేష్, పోతురాజురెడ్డి, బుర్ల ముసలయ్య, మద్దిబోయన సుబ్బరాజు, రాజు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు అధికారులు

భాగస్వామి పెన్షన్ల పంపిణీ వాయిదా

బాపట్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకంలో భాగంగా నూతనంగా మంజూరైన భాగస్వామి పెన్షన్‌ల పంపిణీ వాయిదా పడినట్లు కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. ముందుగా 12వ తేదీన పంపిణీ చేస్తామని ప్రకటించినప్పటికి కొన్ని కారణాల వల్ల వాయిదా వేసినట్లు తెలిపారు. మరో తేదీ ప్రకటించి పంపిణీ చేస్తామన్నారు. బాపట్లకి నూతనంగా 64 పెన్షన్‌లు, మండలానికి 109 పెన్షన్‌లు మంజూరైనట్లు తెలిపారు.

బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీలో ముగిసిన శిక్షణ

బాపట్లరూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీలో ఐక్యామ్, యుఎస్ఎ వారిచే ఉపాధ్యాయులు, విద్యార్థులకు నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో సాఫ్ట్‌స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో ప్రాముఖ్యత ఉందని, విద్యార్థులు ఇది గమనించి ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు మెమెంటోలతో పాటు సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఏ నుంచి వచ్చిన డేవిడ్ గిల్సన్, ఎస్.పద్మ, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు, ఎడ్యుకేషన్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు

కార్మికుల వేతనాలు పెంపుదల చేయాలి

రేపల్లె, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఇంజనీరింగ్ విధులు నిర్వహిస్తున్న కార్మికుల వేతనాలను పెంపుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కారాల్యయం వద్ద ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంపుదల చేయాలంటూ ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీవో ప్రకారం రూ.24,500 జీతాలు పెంచి చెల్లించాలని ఉందని, కానీ నేటికి అమలయ్యే దాఖలాలు లేవన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎన్.నవీన్, కె.రాఘవేంద్రరావు, యువరాజు, బీటెక్ రవి, అనూష, సుధాకర్, మౌలాలి, కిషోర్ పాల్గొన్నారు.



గుడ్డికాయలంక-సజ్జావారిపాలెంరోడ్డులో నిలిచిన వర్షపు నీరు

తీరంలో భారీ వర్షం

- రహదారులు జలమయం.. ప్రయాణికుల ఇక్కట్లు

రేపల్లె, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలో మంగళవారం రాత్రి నుంచి ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. దీంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. రేపల్లె నుంచి నిజాంపట్నం వెళ్ళేరహదారి అభివృద్ధి పనులు చేస్తుండటంతో ఒక వైపు అంతా అడుగులోతు గుంతపడటంతో వర్షపునీరు నిలిచి ప్రయాణికుల ఇక్కట్లు పడ్డారు. అలాగే నిజాంపట్నం మండలం పల్లపట్ల వద్ద రహదారి అభివృద్ధిలో భాగంగా ఇటీవల తవ్వకాలు జరపటంతో మోకాలు లోతు వర్షపు నీరు నిలిచింది. రేపల్లె-నిజాంపట్నం రహదారికి సుమారు రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయగా సంబంధిత కాంట్రాక్టరు రహదారికి ఒకవైపు అడుగులోతు గుంతకొట్టి ఎక్స్‌కవేటర్‌ల ద్వారా రహదారిని లెవల్ చేశారు.




సజ్జావారిపాలెం సెంటర్‌లో నిలిచిన వర్షపు నీరు

నిరుపేద ముస్లిం కుటుంబానికి బియ్యం అందజేత

కర్లపాలెం జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ముస్లిం ఐక్యవేదిక బాపట్ల జిల్లా అధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్ (తాజ్) వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఒక నిరుపేద ముస్లిం కుటుంబానికి 25 కేజీల బియ్యంను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మొహిద్దీన్‌బేగ్, దమ్మనవారిపాలెం మాజీ సర్పంచ్ కాసాని వరప్రసాద్, తాతపూడి మనోహర్, జాలాది విజయరావు, వీరారెడ్డి, హనుమయ్య పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కర్లపాలెం జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీ సత్యవతిపేటలో రెడ్డి సేవామిత్ర ఆధ్వర్యంలో బుధవారం ఫోకస్ కంటి వైద్యశాల వైద్యులు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యుడు కిషోర్ పాల్గొని 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 30 మందికి కళ్ళజోళ్ళు అవసరం కాగా 40మందికి శుక్లాల ఆపరేషన్ అవసరం ఉందని వీరిని రేపల్లె ఫోకస్ కంటి ఆసుపత్రికి తీసుకెళ్ళి ఆపరేషన్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సేవామిత్ర అధ్యక్షుడు నంగు గోవర్ధనరెడ్డి, గ్రామపెద్దలు ఇసుకుల కేశవరెడ్డి, పిట్టు సాంబశివారెడ్డి, మున్నం శ్రీనివాసరెడ్డి, బాల రవిమోహన్‌రెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, సమ్మెట గోవర్ధనరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కట్లమ్మతల్లి వార్షికోత్సవం

అమృతలూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తురుమెళ్ళ గ్రామ దేవత శ్రీ కట్లమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు, మహిళలు మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఆయా ఏర్పాట్లను గ్రామస్థులు పర్యవేక్షించారు.

రేపల్లె నియోజకవర్గంలో రూ.400 కోట్లతో అభివృద్ధి

- మంత్రిగా బాధ్యతలు స్వీకరించి నేటికి సంవత్సరం
- మంత్రి అనగాని సత్యప్రసాద్



అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : రేపల్లె నియోజకవర్గాన్ని సంవత్సర కాలంలో రూ.400 కోట్లతో అన్ని రంగాలను కలుపుకుని అభివృద్ధి చేశామని రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్ శాఖా మంత్రి అనగానిసత్యప్రసాద్ అన్నారు. మంత్రిగా బాధ్య తలు స్వీకరించి గురువారానికి సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. సీఎం చంద్రబాబు ప్రోత్సాహంతో నియోజకవర్గంలోని 395మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్‌కింద రూ.5.32 కోట్ల ఆర్థికసాయం చేశామని చెప్పారు. రేపల్లె ఎస్సీ బాలికల హస్టల్‌కు రూ.50 లక్షలు, బీసీ బాలుర హస్టల్‌కు రూ.10 లక్షలతో అభి వృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రధానమంత్రి నిధుల నుంచి కోటి 45లక్షలతో సీసీరహదారులు కమ్యూనిటీ హాల్స్ పల్లెపండుగ కింద నియోజకవర్గంలో రూ.52 కోట్లతో 1, 2 ఫేజ్‌ల్లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి, మూడవ ఫేజ్ పనులు ప్రారంభం కానున్నాయి. రూ.9 కోట్లతో 450బూత్‌ల షెడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో రూ.31 కోట్లతో జలజీవన్‌పనులు నిధులు తీసుకురావటం జరిగింది. రహదారుల పునర్నిర్మాణానికి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖా ద్వారా రూ.9 కోట్ల పనులు జరుగుతున్నాయని చెప్పారు. దిండి పంచాయతీలో ఆక్వా పార్కు నిర్మాణానికి రూ.85 కోట్లు, రోడ్లు, భవనాలశాఖ నుంచి రూ.15 కోట్లు, పీఎంజీఎస్‌వై కింద రూ.5 కోట్లు, ఆర్ఎం డ్రెయిన్‌కింద చెక్కావారిపాలెం నుంచి కొమరవోలు వరకు రూ.2.53 కోట్లతో రహదారి నిర్మా ణం, నిజాంపట్నం నుంచి దర్వేజ్‌పాలెం వరకు రూ.5.65 కోట్లతో రహదారి నిర్మా ణం, రేపల్లె మున్సిపాల్టీలో రూ.4 కోట్లతో పలు అభివృద్ధి, సీసీ రహదారులు, డ్రెయినేజీ నిర్మాణాలు, మంచినీటి వసతి కల్పన, రూ35 లక్షలతో పట్టణంలో డ్రెయిన్‌లు పూడికతీత, పాఠశాలల అదనపు తరగతి గదులకు రూ.39 లక్షల నిధులు కేటాయింపు జరిగిందన్నారు. మత్స్యకార భరోసా కింద నియోజకవర్గంలోని 7,304 మంది మత్స్యకారులకు రూ.14 కోట్ల 60 లక్షల 80 వేలు పంపిణీ చేయటం జరిగిందన్నారు. నగరం మండలం ధూళిపూడి కమ్యూనిటీ హాల్ సెంటర్‌కు రూ.4.48 కోట్లతో శంకుస్థాపన పనులు జరుగుతున్నాయి. నియోజకవర్గంలో 590 డ్వాక్రా గ్రూపులకు రూ.130 కోట్ల 60 లక్షలు రుణాలు మంజూరు చేశామన్నారు.

నియోజకవర్గంలో రూ.132 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు

- ఏడాది పాలనపై ఎమ్మెల్యే ఆనందబాబు



ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి పాలన ద్వారా అభివృద్ధి, సంక్షేమం జోడు గుర్రాలుగా ముందుకు నడుస్తున్నాయని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. కూటమి ప్రభుత్వ పాలన ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, జగన్ పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ప్రజా సంక్షేమం ఏమాత్రం సాగలేదని విమర్శించారు. కూటమి పాలన ద్వారా ఏడాది కాలంలోనే రూ.132 కోట్ల 73 లక్షల వ్యయంతో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు రైతులను దృష్టిలో పెట్టుకుని సాగునీటి మురుగునీటి కాల్వల మరమ్మతులకు రూ.3 కోట్లు పంచాయితీరాజ్ శాఖ ద్వారా 159 సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.81 కోట్ల 73 లక్షల ఉపాధి నిధుల నుంచి 61 సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.28 కోట్లు, వేమూరు వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఐదు మండలాల పరిధి నుండి రైతులు పండించిన పంటలను రవాణా చేసుకునేందుకు వీలుగా లింకు రోడ్లు, డొంక మార్గాలు నిర్మాణం చేపట్టేందుకు రూ.20 కోట్ల దాకా నిధులను కేటాయించడం జరిగిందన్నారు. నీటి పారుదల శాఖల ద్వారా మరమ్మతుల పనులు చురుకుగా సాగుతున్నాయన్నారు. దెబ్బతిన్న రహదారులను నిర్మించేందుకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులను కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ నెలాఖరులో సంబంధించిన నిధులు విడుదల అవుతాయని పనులను జూలై నెలలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా రూ.10 కోట్ల నిధులు కేటాయింపు జరిగిందని, గ్రామాల్లో మంచినీటి సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



పొన్నపల్లిలో గోకులం షెడ్లను ప్రారంభిస్తున్న అనగాని శివప్రసాద్

మండలంలో అభివృద్ధి పనులకు భూమిపూజ

చెరుకుపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాలలో అభివృద్ధి పనులకు బుధవారం తెలుగుదేశం పార్టీ నాయకుడు అనగాని శివప్రసాద్ భూమిపూజలు నిర్వహించారు. బలుసులపాలెం గ్రామంలో రూ.48లక్షల నిధులతో ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్‌స్కీం, రూ.30 లక్షల నిధులతో నిర్మించిన సీసీరోడ్ల ప్రారంభోత్సవం, రూ.30 లక్షల నిధులతో ఫేజ్ సీసీ రోడ్ల నిర్మాణం, నడింపల్లి గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్‌స్కీం ద్వారా రూ.63.70 లక్షల నిధులతో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. పొన్నపల్లి గ్రామంలో గోకులం షెడ్డును ప్రారంభించారు. కృష్ణాపశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ మత్తి భాస్కరరావు, టీడీపీ నాయకులు కొనకాల రవికిరణ్, ఎం.రాధాకృష్ణమూర్తి, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లాదిరామకృష్ణ, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గోగినేని వసుధ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికి తాగునీరు : అనగాని

నగరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : ఇంటింటికి తాగునీరు అందించే బృహత్తరమైన కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. నగరంలోని పెద్దవరం గ్రామంలో 119.60 లక్షల నిధులతో సీసీరోడ్లనిర్మాణం, నగరంగ్రామంలోని రూ.81.80లక్షలనిధులతో ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్‌స్కీమ్‌కు బుధవారం భూమిపూజ చేశారు. అంతేకాకుండా రూ.20 లక్షల నిధులతో 3వఫేజ్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ, పూడివాడ గ్రామంలోని రూ.110 లక్షల నాబార్డు నిధులతో పూడివాడ-గుళ్ళపల్లి ఆర్ అండ్ బీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు, తహసీల్దార్ నాంచారయ్య, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, లుక్కా గుడారంకయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.4 లక్షల వ్యయంతో పంట కాల్వల మరమ్మతులు

వేమూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొల్లిపర ఛానల్ కింద ఉన్న చంపాడు కాల్వ పరిధిలో రూ.4 లక్షల వ్యయంతో మరమ్మతులు చేపట్టినట్లు నీటిపారుదల శాఖ ఏఈ రవి తెలిపారు. నీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ దండే వెంకటసుబ్బారావు పర్యవేక్షణలో కొల్లిపర ఛానల్ 7.7 కి.మీ నుంచి 14వ కి.మీ వరకు చక్రాయపాలెం గ్రామ శివారు నుంచి చంపాడు వరకు కాల్వలో పూడికలు తీయడం, తూటికాడ తొలగింపు, కట్టలు బలోపేతం చేయడం పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఖరీఫ్ సాగుకు కాల్వ పరిధిలోని రైతులకు ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈ ప్రాంత రైతులు కాల్వల మరమ్మతులకు నిధులు కేటాయింపుపై సహకరించిన ఎమ్మెల్యే ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.



చంపాడు వద్ద పంట కాల్వ మరమ్మతులు చేస్తున్న చిత్రం